విద్యుత్ సిబ్బంది మర్యాదగా ప్రవర్తించాలి

మాట్లాడుతున్న ఎస్ఈ సత్యనారాయణ

జగిత్యాల, ఏప్రిల్ 18: విద్యుత్ వినియోగదారులతో మర్యాదగా ప్రవర్తించాలని జిల్లా విద్యుత్ శాఖాధికారి సత్యనారాయణ సిబ్బందికి సూచించారు. జిల్లా పరిధిలోని ఆపరేషన్, మెయింటెనెన్స్ విద్యుత్ సిబ్బందికి, జూనియర్ లైన్‌మెన్, ఫోర్‌మెన్లకు అంతర్గత సమర్థత అభివృద్ధి నిరంతర కరెంట్ సరఫరా కోసం మాస్టర్ ట్రైనర్స్, డీఈ టెక్నికల్ ఆధ్వర్యంలో డిప్లొమా ఇంజినీర్స్ భవన్ మీటింగ్ హాల్‌లో శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఈ విద్యుత్ సిబ్బందికి విధులు బాధ్యతలు తెలియజేసి, ప్రతిజ్ఞ చేయించారు. కరెంట్ ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని నిర్దేశించారు. వంద శాతం బిల్లులు వసూలు చేయాలని, రైతులకు బోర్ మోటర్ కనెక్షన్లకు కావాల్సిన ట్రాన్స్ ఫార్మర్లు, పోళ్లను వెంటనే అందజేయాలన్నారు. స్టాఫ్ స్థానికంగా హెడ్ క్వార్టర్‌లోనే ఉండాలని కోరారు. సమావేశంలో తిరుపతయ్య, గంగారాం, రాజిరెడ్డి, తిరుపతి, రవీందర్, లక్ష్మణ్, నగేశ్ కుమార్, వెంకటేశ్వర్లు, జవహర్ నాయక్, హరీశ్ పాల్గొన్నారు.

గైడియల్ ఒలింపియాడ్‌లో విద్యార్థుల సత్తా

విద్యార్థులతో స్కూల్ కరస్పాండెంట్

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 18 : పట్టణంలోని జ్యోతి హైస్కూల్ ఐఐటీ అకాడమి విద్యార్థులు గత నెలలో నిర్వహించిన గైడియల్ ఒలింపియాడ్ పరీక్షలో ప్రతిభ చూపారని స్కూల్ డైరెక్టర్ హరిచరణ్ రావు తెలిపారు. గైడియల్ ఒలింపియాడ్‌లో ఆరో తరగతికి చెందిన పీ అనిరుద్ సైన్స్‌లో స్టేట్ 9వ ర్యాంక్, ఏడో తరగతికి చెందిన ఆప్రా గైడియల్ ఇంగ్లిష్ లో డిస్ట్రిక్ట్ ఫస్ట్ ర్యాంక్, ఏడో తరగతికి చెందిన సీహెచ్ కీర్తన మాథ్స్‌లో డిస్ట్రిక్ట్ 4వ ర్యాంకును సాధించినట్లు వెల్లడించారు. వీరిని స్కూల్ యాజమానులు హరిచరణ్‌రావు, శ్రీధర్‌రావు, మౌనికారావు, రజితారావు, అజితరావు అభినందించారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు

మంత్రికి న్యాయవాదుల ఆత్మీయ సత్కారం

కోర్టుచౌరస్తా, ఏప్రిల్ 18: జిల్లా కేంద్రంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌ను గురువారం కరీంనగర్ బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పీవీ రాజ్ కుమార్, ప్రధాన కార్యదర్శి బేతి మహేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు తిరుణగరి రఘువీర్, కార్యదర్శి బీమా సాహెబ్, కోశాధికారి రామగిరి శ్రీనివాస్, లైబ్రరీ కార్యదర్శి కటకం రాజేందర్, స్పోర్ట్స్ కార్యదర్శి మడిపల్లి రవి, లేడీ రిప్రజెంటేటివ్ రేణుక, సీనియర్ ఈసీ మెంబర్లు మాతంగి రవీందర్, కందుల అరుణ్ కుమార్, సుంకె దేవకిషన్, జూనియర్ ఈసీలు బెజ్జంకి శ్రీకాంత్, కొండ్ర లక్ష్మయ్య, పాస్తం ఆంజనేయులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ గడ్డం లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, సీనియర్ న్యాయవాదులు కొరివి వేణుగోపాల్, గోపాల్ రావు, ఉప్పల ఆంజనేయ ప్రసాద్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

★ Bojja Gattu Jyothi, D/o Kudukala Kishtaiah @ Kuduka Kishtaiah, W/o. Bojja Gattu Mohan H.No. 3-37, Ashireddypally, Chandurthy, Rajanna Sircilla. my Name and husband Name as changed as Gattu Jyothi W/o Gattu Mohan.
NTK-311280

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

పీఆర్సీ కమిషనర్‌తో టీపీసీఎ చర్చలు

జగిత్యాల, ఏప్రిల్ 18 : వేతన సవరణ కమిషనర్ శివశంకర్ ఆహ్వానం మేరకు తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గాజుల నర్సయ్య ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్ బీఆర్‌భ భవన్‌లో కలిసి వేతన సవరణపై చర్చలు జరిపినట్లు అసోసియేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ తెలిపారు. ఇందులో ఫిట్‌మెంట్ 40 శాతం తగ్గకుండా ఇవ్వాలని, పెండింగులో ఉన్న 3 డీఏలను విడుదల చేయాలని, గ్రాట్యుటీ రూ. 16 లక్షల నుంచి రూ. 20 లక్షలకు పెంచాలని, అడిషనల్ క్వాంటం పెన్షన్ 65 ఏళ్ల వారికి 15 శాతం ఆదనంగా చెల్లించాలని, అంత్యక్రియలకు రూ 50 వేలు మంజూరు చేయాలని, ఈ కుబేర్ పథకం రద్దు చేయాలని కోరామన్నారు. వేములవాడ, భద్రాచలం, యాదాద్రి దేవాదాయ, గ్రంథాలయ, వాటర్ వర్క్స్, మార్కెట్ కమిటీల, సహకార సంస్థలు, సింగరేణి కాలరీస్ పెన్షనర్లకు ప్రభుత్వ పెన్షనర్స్ మాదిరిగా నగదు రహిత ఆరోగ్య కార్డులను ఇవ్వాలన్నారు. వైద్య అలెవెన్సులు రూ.2 వేలు ప్రతి నెలా చెల్లించాలని కమిషనర్‌కు వివరించినట్లు వెల్లడించారు. ఇక్కడ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నవనీతారావు, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కేశవరెడ్డి, కార్యదర్శి లింగయ్య పాల్గొన్నారు.

వైభవంగా రాములోరి పట్టాభిషేకం

మారుతీనగర్,ఏప్రిల్ 18 : మెట్‌పల్లి పట్టణంలోని శ్రీ కోదండరామాలయంలో రాములోరి పట్టాభిషేకం గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవమూర్తులకు ప్రత్యేకపూజలు అభిషేకార్చనలు చేశారు. పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు పట్టాభిషేక ఘట్టాన్ని తిలకించి పులకించిపోయారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మహాజన్ నర్సింలు, సభ్యులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థిని ఆదరించాలి

- ప్రశ్నించే గొంతుక వినోద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి
- జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ
- మన్నెగూడంలో ముమ్మర ప్రచారం

కరపత్రాలు పంపిణీ చేస్తూ ఓటు అభ్యర్థిస్తున్న తుల ఉమ, బీఆర్ఎస్ నాయకులు

మేడిపల్లి, ఏప్రిల్ 18: పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుకైన బోయినపల్లి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ ప్రజలకు పిలుపునిచ్చారు. భీమారం మండలం మన్నెగూడెంలో గురువారం జడ్పీ ఉపాధ్యక్షుడు వొద్దినేని హరిచరణ్‌రావుతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు చెన్నమనేని రవీందర్‌రావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు క్యాతం సత్తిరెడ్డి, మాజీ సర్పంచులు కాచర్ల సురేశ్, నాంచారి స్వప్న, రాజేందర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొండా కిషన్, బీఆర్ఎస్ సోషల్ మీడియా మండల కన్వీనర్ దురిశెట్టి లక్ష్మణ్ కుమార్, నాయకులు చెన్నమనేని శ్రవణ్ రావు, ప్రశాంత్, ప్రదీప్, ప్రవీణ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీఈవో జగన్మోహన్‌రెడ్డి

సర్కారు బడుల్లోనే చేర్పించాలి

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 18: ఉపాధ్యాయులు తల్లిదండ్రులను చైతన్యం చేసి వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని డీఈవో జగన్మోహన్‌రెడ్డి సూచించారు. గురువారం డీఈవో ఆఫీసులో వచ్చే విద్యా సంవత్సరం విద్యార్థుల సంఖ్య పెంపునకు జడ్పీహెచ్ఎస్ వెల్గొండ, ఎంపీపీఎస్ వెల్గొండ పాఠశాల వారు ముద్రించిన వాల్‌పోస్టర్‌ను డీఈవో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులందరూ సమిష్టిగా కృషి చేస్తేనే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అమర్‌నాథ్‌రెడ్డి, ఆనందరావు, జడ్పీహెచ్ఎస్ హెడ్మాస్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీఎస్ హెడ్మాస్టర్ దశరథ రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

తూకం వేసిన వెంటనే మిల్లులకు తరలించాలి

లింగంపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ రాంబాబు

మేడిపల్లి, ఏప్రిల్ 18: తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్లులకు తరలించాలని అడిషనల్ కలెక్టర్ రాంబాబు సెంటర్ల నిర్వాహకులకు సూచించారు. భీమారం మండలం లింగంపేటలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందునా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. హమాలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. అలాగే మేడిపల్లి, కట్లకుంట గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల ప్రత్యేక అధికారి, అడిషనల్ డీఆర్డీవో మదన్‌మోహన్ పరిశీలించారు. వసతులను పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో త్రివేదిక, ఏపీఎం గట్ల అశోక్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌యాదవ్, ఏఈఓలు, సీసీలు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన

కథలాపూర్, ఏప్రిల్ 18 : మండలంలోని చింతకుంట, భూషణ్‌రావుపేట, కథలాపూర్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీఆర్డీవో సంపత్‌రావు గురువారం పరిశీలించారు. తేమశాతం పరీక్షించాకే నిబంధనల మేరకు త్వరగా తూకం వేయాలని సిబ్బందికి సూచించారు. కేంద్రాల్లోని రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. ఆయన వెంట ఎంపీడీవో శంకర్, ఏపీఎం నరహరి, సీసీలు అంజయ్య, అశోక్, విజయ నిర్మల తదితరులు ఉన్నారు.

నీటి ఎద్దడి నివారణపై దృష్టిపెట్టాలి

మాట్లాడుతున్న ఎంపీపీ భీమేశ్వరీ

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 18 : గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపీపీ జాజాల భీమేశ్వరీ అధికారులకు సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీ పీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ప్రస్తుతం ఎండ తీవ్రత ఎక్కువ ఉన్నందున భూగర్భ జలా లు అడుగంటే ప్రమాదం ఉన్నదన్నారు. అలాగే గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, ఎంపీడీవో రాజేందర్ రెడ్డి, ఎంఈవో ఆనంద్‌రావు, ఎంపీటీసీలు బోరిగం రాజు, దేశెట్టి శాంత, బాశెట్టి రాధ, మాలవత్ సరోజ, బోరిగాం వివేక వర్ధిని, కోఆప్షన్ సభ్యులు చిన్నారెడ్డి పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

గ్యాస్ గోదాం వద్ద అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మెట్‌పల్లి,ఏప్రిల్ 18 : పట్టణంలో అగ్నిమాపక వారోత్సవాలు అగ్నిమాపక కేంద్ర అధికారి మల్లికార్జున్‌యాదవ్ ఆధ్వర్యంలో గురువారం ఐదోరోజు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా స్థానిక గ్యాస్ గోదాం వద్ద అగ్ని ప్రమాదాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్యాస్ గోదాం సిబ్బందికి అవగాహన కల్పించారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది ఆంజనేయులు, వహిదుల్లాఖాన్, భాస్కర్, సంతోష్, రాజేశ్, సంతోష్‌కుమార్, అమర్‌సింగ్ ఉన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి చర్యలు

మ్యాపును పరిశీలిస్తున్న స్తపతి, అధికారులు

వేంకటేశ్వర స్వామి ఆలయ మండపాలను పునర్నిర్మించాలని నిర్ణయించారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర దేవాదాయశాఖ స్తపతి వల్లాయగం, అధికారులు ఆలయాలను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఇక్కడ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మల్లికార్జున్ రెడ్డి, వేములవాడ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజేశ్, ఆలయ ఈవో వేణుగోపాల్ ఉన్నారు.

మల్యాల మండల ఇన్‌చార్జి ఎంపీపీగా రవి

రవిని అభినందిస్తున్న ఎంపీడీవో, ఎంపీటీసీలు

మల్యాల, ఏప్రిల్ 18 : మల్యాల మండల పరిషత్ అధ్యక్షురాలిగా ఉన్న మిట్టపల్లి విమలపై సభ్యులు పెట్టిన అవిశ్వాసం నెగ్గడంతో వైస్ ఎంపీపీగా కొనసాగుతున్న పోతాని రవి ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు మండలంలోని పలువురు ఎంపీటీసీలు, ఎంపీడీవో స్వాతి, కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

హనుమాన్ దీక్ష తీసుకున్నాడని..

- ఉద్యోగంలోంచి తొలగింపు
- కంపెనీ కార్యాలయం ఎదుట దీక్షాపరుల ఆందోళన
- క్షమాపణ చెప్పి విధుల్లోకి తీసుకున్న మేనేజర్

జగిత్యాలలోని కార్పొరేట్ కంపెనీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న హన్మాన్ దీక్షాపరులు

జగిత్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 18: హనుమాన్ దీక్ష తీసుకున్నాడని ఉద్యోగిని కించపరిచి ఉద్యోగంలోంచి తొలగించిన ఘటన జగిత్యాలలో జరిగింది. తర్వాత కంపెనీ కార్యాలయం ఎదుట దీక్షాపరుల ఆందోళనతో సదరు మేనేజర్ క్షమాపణలు చెప్పి తిరిగి విధుల్లోకి తీసుకున్నారు. బాధితుడు, దీక్షాపరులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల పట్టణానికి చెందిన ప్రణీత్ కలెక్టరేట్ సమీపంలో ఓ ప్రైవేటు కార్పొరేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవలే హన్మాన్ దీక్ష తీసుకున్నాడు. అయితే కంపెనీ యూనిఫాం వేసుకోవడంలేదని జగిత్యాల బ్రాంచ్ మేనేజర్ సదరు ఉద్యోగిని వేధింపులకు గురి చేస్తూ ఉద్యోగంలోంచి తొలగించాడు. దీంతో విషయం తెలుసుకున్న దీక్షా పరులు ప్రవీణ్‌కు మద్దతుగా గురువారం సదరు కంపెనీ కార్యాలయం ముందు జగిత్యాల-కరీంనగర్ రహదారిపై బైఠాయించారు. దీక్షాపరుడిని కించపరచడమే కాకుండా ఉద్యోగంలోంచి తొలగించిన మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న సదరు కంపెనీ బ్రాంచ్ మేనేజర్ జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్‌లో తలదాచుకున్నాడు. దీంతో పోలీసులు కలుగజేసుకొని కంపెనీ మేనేజర్‌ను ఘటనా స్థలానికి తీసుకువచ్చారు. దీంతో మేనేజర్ తప్పొప్పుకొని హన్మాన్ దీక్షాపరులకు, ప్రణీత్‌కు క్షమాపణ చెప్పారు. తిరిగి ఉద్యోగంలోకి తీసుకుంటున్నట్లు అందరి ముందు చెప్పడంతో ఆందోళన విరమించి అక్కడి నుంచి వెనుదిరిగారు.

ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

కోరుట్ల, ఏప్రిల్ 18: పట్టణ శివారు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఖాళీగా ఉన్న రెండు ఇంజినీరింగ్ (సివిల్, మెకానికల్) డిప్లొమా కోర్సుల్లో సీట్ల భర్తీ కోసం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రమా ప్రసాద్ ఒక ప్రకటనలో గురువారం తెలిపారు. ఈనెల 22వ తేదీతో గడువు ముగుస్తుందని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష కోసం జగిత్యాల, కోరుట్లల్లో కేంద్రాలను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కొడిమ్యాల, ఏప్రిల్ 18: మండలంలోని నల్లగొండ గ్రామ శివారులో రామకిష్టాపూర్‌కు వెళ్లే దారిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు హెడ్ కానిస్టేబుల్ అర్షరాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మతి స్థిమితం లేని గుర్తు తెలియని వ్యక్తి గురువారం ఉదయం గ్రామ శివారులోని గుట్ట ప్రాంతానికి వచ్చాడు. సాయం త్రం చెట్ల పొదల్లో విగతజీవిగా పడిఉండగా గుర్తించారు. మృతుడు 40 ఏండ్ల వయస్సు ఉంటాడని జీన్స్ ప్యాంట్, కొమురవెల్లి మల్లికార్జున స్వామి లాకెట్ ఉందని తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు చెప్పారు.

పసుపు క్వింటాల్ ధర రూ.15,016

మెట్‌పల్లి, ఏప్రిల్ 18: మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం పసుపు కాడి రకానికి క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ. 15,016 ధర పలికింది. కనిష్ఠంగా రూ. 13,251, పసుపు గోళకు గరిష్ఠంగా రూ. 14,051, కనిష్ఠంగా రూ.13,716, పసుపు చూరకు గరిష్ఠంగా రూ. 13,628 కనిష్ఠంగా రూ.12,009 వేలు ధర పలికింది. ఇప్పటి వరకు మార్కెట్‌లో 27,603 క్వింటాళ్ల పసుపు కొనుగోలు చేసినట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి తెలిపారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

బావిలో పడి ఇద్దరి మృతి

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 18 : మండలంలోని మోహన్‌రావుపేట్, గుమ్లాపూర్ గ్రామాల్లో ప్రమాదవశాత్తు బావిలో పడి ఇద్దరు వృద్ధులు మృతి చెందిన సంఘటన గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..మోహన్‌రావుపేటలో బుధవారం రాత్రి గుండవేని చిన్నక్క(98) ఇంటి ఎదుట ఉన్న చేదబావిలో నీరు తోడుతుండగా ప్రమాదవశాత్తు పడి మృతి చెందింది. మృతురాలి కుమారుడు గుండవేని రాజలింగం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే గుమ్లాపూర్‌లో అడ్డగట్ల రాజేశం (61) మతి స్థిమితం లేక తిరుగుతుండేవాడు. గ్రామ శివారులోని మామిడితోటలోని బావిలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. మృతుడి భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ వివరించారు.

నానో ఎరువులపై రైతులకు అవగాహన

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 18: గోపాల్‌పూర్ గ్రామంలో ఇఫ్‌కో కంపెనీ ఆధ్వర్యంలో కూరగాయల సాగులో నానో యూరియా, నానో డీఏపీ వాడకంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇఫ్‌కో సంస్థ జిల్లా అధికారి బాలాజీ మాట్లాడుతూ, నానో యూరియా, డీఏపీ వాడడంతో ఖర్చు తగ్గడంతోపాటు భూమి సారవంతంగా ఉంటుందని తెలిపారు. దుర్గేడ్ సింగిల్ విండో చైర్మన్ తోట తిరుపతి మాట్లాడుతూ, నానో ఎరువులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మండల వ్యవసాయాధికారి సత్యం మాట్లాడుతూ, నానో యూరియా వాడిన రైతుల పంట పొలాలను పరిశీలించామని, మంచి దిగుబడి వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో ఆదర్శ రైతు మంద తిరుపతి, తోట వేణు, రామకృష్ణ, రమేశ్, రాజిరెడ్డి, శ్రీనివాస్, అంజయ్య, రాజయ్య, అనిల్, కుమార్, రమేశ్, ప్రకాశ్, నారాయణ ఉన్నారు.

రూ. 24.80 లక్షల మద్యం స్వాధీనం

మాట్లాడుతున్న సత్యనారాయణ

జగిత్యాల, ఏప్రిల్ 18: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఇప్పటి వరకు రూ. 24,80,945 విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి సత్యనారాయణ తెలిపారు. మార్చి 16నుంచి ఏప్రిల్ 17 వరకు 105 గుడుంబా కేసులు నమోదు చేసి 17మందిని అరెస్ట్ చేశామన్నారు. 350 లీటర్ల గుడుంబా, 21320 లీటర్ల బెల్లం పానకాన్ని పట్టుకున్నామని వెల్లడించారు. ఈ నేరాలకు ఉపయోగించిన ఏడు వాహనాలను సీజ్ చేశామని పేర్కొన్నారు. గుడుంబా తయారీ, సరఫరా, రవాణా, గంజాయి, అక్రమ మద్యం, అనధికార మద్యం దుకాణాల నిర్వహణ తదితర నేరాల నియంత్రణకు ఎక్సైజ్ శాఖలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం, జిల్లా టాస్క్ ఫోర్స్, స్టేషన్ సిబ్బంది రెవెన్యూ, పోలీసు శాఖ సిబ్బంది సమన్వయంతో దాడులు చేస్తున్నాయని చెప్పారు. ఎక్సైజ్ నేరాల ఫిర్యాదుల కోసం జిల్లా ఎక్సైజ్ కార్యాలయ కంట్రోల్ రూం 8019108768, జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ 8712658823, జగిత్యాల ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ 8712658824, ధర్మపురి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ 8712658825, మెట్‌పల్లి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ 8712658826 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు మణికంఠ

విద్యార్థిని అభినందిస్తున్న పీఈటీలు, ఉపాధ్యాయులు, స్కూల్ కరస్పాండెంట్లు

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 18: జగిత్యాల మండలం ధరూర్‌లోని మౌంట్ కార్మెల్‌లో చదువుతున్న విద్యార్థి కొక్కు మణికంఠ జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు స్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ జ్యోతీస్, ఫాదర్ జోసెఫ్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు హర్యానాలో జరిగే జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ఐయూ17 బాస్కెట్ బాల్ పోటీలకు మణికంఠ తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు వెల్లడించారు. మణికంఠను పీఈటీలు మంగ, పులి విజ్ఞాన్, కందుకూరి సామంత్, హరీశ్, ఉపాధ్యాయులు అభినందించారు. జాతీయ పోటీల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు.

మేడిపల్లిలో వరి పంటకోత ప్రయోగం

కోసిన ధాన్యాన్ని తూకం వేస్తున్న అధికారులు

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్ 18: మండలంలోని మేడిపల్లిలో గురువారం అధికారులు పంటకోత ప్రయోగం నిర్వహించారు. గ్రామానికి చెందిన లోక గంగాధర్ రైతు పొలంలో అర్థ గణాంక శాఖ ఉప సంచాలకులు మోహన్‌రెడ్డి సమక్షంలో ఏఈవో మ నోజ్ఞ పంటకోత ప్రయోగం జరుపగా, పావుగుంట విస్తీర్ణంలో 18.950 కిలో గ్రాముల దిగుబడి వచ్చింది. గణాంక అధికారి మల్లేశం, ఉప గణాంకాధికారులు శ్యాంసుందర్, నగేశ్, రామకృష్ణ పాల్గొన్నారు.

ఏఎస్సార్ తండాలో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- ఐదుగురి అరెస్ట్

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్ 18: మెట్‌పల్లి మండలం ఏఎస్సార్ తండాలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై బుధవారం రాత్రి దాడి చేసినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. కొంతకాలంగా గుగ్లావత్ గంగాదాస్ తండాలో పేకాట స్థావరం నడుపుతున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేయగా, ఐదుగురు పేకాటరాయుళ్లు పట్టుబడినట్లు పేర్కొన్నారు. వీరి వద్ద నుంచి రూ. 8 వేల నగదు, ఐదు సెల్‌ఫోన్లు, తొమ్మిది బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కాగా మరో తొమ్మిది మంది పరారైనట్లు పేర్కొన్నారు. నిర్వాహకుడితో సహా 14 మందిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.